అందుకు ఒప్పుకోక ఆమెకు నిర్బంధం చేసిఉండొచ్చు. ఇదొక కారణం. మరో కారణం, ఆమెకు ఎప్పుడూ క్షేమకరమైన సంతోషవార్తలు వినాలని ఉంటుంది కాబోలు! అందరూ విషాద సమాచారాలని విని పించి ఆమె కోమల హృదయాన్ని గాయపరచి ఉంటారు. అంచేత ఆమె పిచ్చిదైంది. నేను అన్నీ మరణవార్తలే చెబితే ఆమె ఎంత బాధపడింది! మూడో కారణం ఏదేనా ఉండొచ్చునా? ఆc, నే పరీక్షించినంతవరకూ మరో కారణంకూడా ఉంది. ఆమెకు నవలలు చదవడం ఇష్టం. ఎవరూ వాటిని ముట్టనివ్వకుండొచ్చు—నవలలు చదివితే మనుషులు చెడిపోతారని కొందరిలో ప్రాకిపోయిన నమ్మకం ఆధారంగా. ఏమో! ఆమె నవలలు చదివే అలా మారిందేమో! బాగా నవలలు చదివినవాళ్ళు పిచ్చివాళ్ళయారు—ఇంతకంటే బలమైన కారణాలు నాకేమీ కన్పించలేదు. సైకాలజిస్టులు ఎవరైనా చెబుతారేమో తెలీదు. కాని ఆమెకు నిజంగా పిచ్చి ఉంటే కుదిరితే బావుండు ననిపిస్తూంది. అంతటి అందమైన స్త్రీకి పిచ్చి ఉండటం క్రూరం!

ఇంకా ఏమేమో ఆలోచించుకుంటూ బస్సు దిగి ఇంటికి నడిచాను. అనవసరంగా రాణీగంజ్ వెళ్ళి తిరిగిరావడానికి డబ్బు వృథాచెయ్యడం తలచుకుంటే ఆమె పిచ్చి నాకుగాని తిరగలేదు కదా అనిపించింది.

---

స్కెచ్

# సహజీవన సార్థక్యం

"రత్నం"

హనుమంతుడికి ఇంకొకళ్ళు చెప్పేదాకా తన శక్తి తనకు తెలిసేదికాదని అంటారు. అంతటి వాడు కాకపోయినా ఆంజనేయుల్లోనూ ఆ లక్షణాలు వంశపారంపర్యంగా వచ్చినవి. కొయ్యాదుకునే బొంగుకూ, కూర్చునే కుర్చీకీ కంసాలి యెందుకంటాడు; బిందెమీదికి ప్రాకి మంచినీళ్ళలో మట్టిపోస్తున్న కొడుకు చిలిపితనాన్ని మనస్తత్వ శాస్త్రరీత్యా పరిశీలిస్తూ చూస్తూ కూర్చుంటాడు! బాగా పాడే గ్రాంఫోను, రేడియోల్ని చెడగొట్టి మళ్ళీ బాగుచేస్తుంటాడు. ఎప్పుడూ దానికి చీల బిగించటమో, దీన్ని ఉలితో చెక్కటమో, బైండు పనిచేయటమో...ఊరికే కూర్చోడు.

సృష్టిలో కన్పించే ప్రతీదీ అతని క్వెశ్చన్ మార్క్‌కు గురిఅయ్యేదే! 'ఇది గొప్పవాడి లక్షణం' అని స్నేహితులు మెచ్చుకునేదాకా తన మేధాశక్తిని తెలుసుకోనేవాడు కాదు ఆంజనేయులు. ఇంతకీ అతడు ఓ పల్లెటూళ్ళో బడిపంతులు. స్నేహితులంతా నాగరికంగా 'అంజీ...!' అని పిలుస్తారు ముద్దుగా.

"మీ నాన్న భలే తెలివిగలవాడురా!" దేనికో మేకులు కొడుతూ—పీకుతున్న అంజితో అన్నాడు శర్మ.

"ఆ తెలివితేటలు మనకు జన్మతో వస్తాయా! మెలికవేశాడంటే వ్యవహారం గిర్రున తిరిగి రావాల్సిందే! అంతటి లౌక్యంగల మనిషి. నలుగురిచేతా భళి భళీ! అనిపించుకున్న మనిషి..."—పరధ్యానంగా అంజి చెప్పుకుపోతున్నాడు తన తండ్రిని గురించి, స్నేహితుల కళ్ళల్లో పరిహాసం గుర్తించక.

"ఏది ఎలా ఉన్నా కొడుకుపేరు మాత్రం తగినట్టు పెట్టేడురా!" ఆపుకోలేక పకపకా నవ్వేశారు శర్మా, చుట్టూ కూర్చున్న స్నేహితులూ.

ఉలిక్కిపడ్డాడు ఆంజనేయులు. "ఏడ్చారులేరా, ఇందుకా అడిగింది!" గ్రహించినట్టు తనూ వాళ్ళతోపాటు నవ్వేడు.

చాలారోజులకు స్నేహితుల్తోపాటు పరిహాసం పంచుకొన్నాడు ఆంజనేయులు. నిన్నటిదాకా దీక్షబట్టినట్టు మూరెడు పొడుగు గడ్డం పెంచి, ప్రతిజ్ఞ నెరవేరిందాకా అన్నం ముట్టనని దగ్గరున్న

కాఫీహోటల్లో ఇడ్లీలూ, పకోడీలు, కాఫీల్తో కాలం గడిపిన ఆంజనేయులు ఇవాళే శుద్ధశ్రోత్రియుడికి మల్లే తల నున్నగా చేయించుకొని, అన్నంటిని కళ కళలాడుతూ కన్పించాడు. మధ్యాహ్నం జరిగిన మీటింగులో విలువెత్తున పెరిగిన ఉక్రోషాన్నీ... అసూయనీ, అధికార గర్వాన్నీ తుడిచిపారవేయించిన విజయగర్వం ఇంకా అతడి కళ్ళల్లో మెరుస్తూనే ఉంది. ఆ ఉత్సాహంలో ఎగతాళికొద్దీ మిత్రబృందం వందిమాగధుల్లా వీరాధివీరా, అరిజన గర్వాపహారణచణా, దొంగ సన్యాసీ, రాజగురూ! అని కైవారం పలికినా స్వీకరించి ఆ హుషారులో పాలుపంచుకున్నాడు.

• • •

వామనరావు హెడ్మాష్టరుగా ఛార్జి తీసుకున్న సాయంత్రమే "మీరు ఎలిమెంటరీ స్కూల్లో హెడ్మాష్టరుగా చేశారా!" అంటూ మెచ్చుకున్నాడు, ఆఫీసు వర్కు విషయంలో అదేపనిగా ఎన్నో సలహాలిస్తున్న ఆంజనేయుల్ని. ఆ రాత్రి ఆంజనేయుల్తోపాటు 'పంతుళ్ళగది'లోనే మకాం వేసి సంవత్సరం నుంచి దానినే మఠంగా వాడుకొంటున్న అతడి మంచి - చెడ్డల్ని కనుక్కొని సానుభూతి చూపించాడుకూడా.

ఇక ఆంజనేయులి కళ్ళల్లో, మాటల్లో, కన్పించే అహంకారానికి అంతేలేదు. హెడ్మాష్టరు ప్రక్కగా కుర్చీమీద కూర్చొని ఆఫీసు కాగితాలన్నీ తనే వ్రాస్తున్నాడు. బండచాకిరిచేస్తూ అతగాడికి అంత మిడిసిపాటెందుకో అర్థంగాలేదు స్నేహితులకి.

ఆదివారమైనా ఆఫీసుపని పూర్తిచేసుకుని... హెడ్మాష్టరు ఇంటినుంచి ఎంతో అప్యాయంగా వచ్చి ఆవకాయబద్దా...గడ్డ పెరుగూ త్రేన్చుతూ సిగరెట్టు ముట్టించి 'చూశావురా, నా సౌఖ్యం!' అన్నట్టు చూశాడు వస్తున్న శర్మవంక.

"ఏమిటిరోయ్...నీ పేరుంది ఈ ఆవకాయ పచ్చడి కాగితమ్మీద...!" గాలికి కొట్టుకుపోతున్న కాగితం వంగి తీసుకుంటూ అన్నాడు శర్మ, కుతూహలం రేకెత్తిన ముఖభంగిమతో. అది వామనరావు పంపిన ఆవకాయపచ్చడి పొట్లం కాగితం. ప్రతిదాన్నీ పరీక్షగాచూసే స్వభావమున్న అంజి 'నాపేరు దీనిమీదికి ఎందుకొచ్చిందబ్బా...!' అనుకొంటూ శర్మ తెచ్చిన కాగితం అందుకొన్నాడు.

రెండు వాక్యాలు చదివేసరికి ఆంజనేయుల ముఖం ఆముదం తాగినట్టయింది. అది వామనరావు తనను గురించి పైకి వ్రాసిన రిపోర్టు నకలు— 'పాఠాలు సరిగ్గా చెప్పడనీ క్లాసులకు వెళ్ళనే వెళ్ళడనీ...ఉత్త అరాజకమ్మనిషనీ—ఇట్లా అవాకులూ చెవాకులూ 'ఎన్‌లైజ్' చేసినట్టు ఎన్నో ఉన్నవి దాంట్లో.

మండిపడ్డాడు ఆంజనేయులు. వామనరావును తెగతిట్టేడు—ఇంగ్లీషులోనూ, అచ్చతెలుగులోనూ, నోటికొచ్చిన మిశ్రమ భాషలోనూ! తనను పొగడ్తల్లో ఆకాశానికెత్తిన వామనరావు అసలు రూపం కుబుసం విడిచిన పాములా అర్థమయింది. 'ఇదిగో...మీదేననుకోండి అంతా! మీ యిష్టం వచ్చినట్టు జరిపెయ్యండి! ఆ ఆఫీసు కాగితాలు వ్రాసి పంపబోయేముందు నామమాత్రంగా నాకూడా కాస్త చూపించండి! మీలాంటి వాళ్ళు మనుషుల్లో ఎంతమంది ఉంటారంటారు!" ఇట్లా ఎందుకుబ్బేశాడో ఇప్పుడు తెలిసింది ఆంజనేయులికి. ఆఫీసుపని రాత్రింబగళ్లు రుబ్బించుకొని గాడిద చాకిరి చేయించుకొని...నమ్మినవాడి కాళ్ళకిందికే నీళ్ళు తెస్తున్న వామనరావు ద్రోహం తల్చుకొని అట్టుడికినట్టు ఉడికిపోయాడు ఆంజనేయులు.

"మమ్మల్నెందుకు నమ్ముతావులేరా నువ్వూ! లేడి వేటకాణ్ణి నమ్ముతుందిట! మొగుడూ పెళ్లాలు కూడా అట్లా అతుక్కుపోరుగదరా గదిలో! ఆ కుర్చీ...డ్రాయరూ చూసేసరికి నీకాగిందీ!" చీవాట్లు పెట్టినట్టు ఎక్కబొడిశాడు శర్మ. ఆ ఎత్తిపొడుపులకు అగ్గయిపోయాడు అంజి.

• • •

ఎదుటిగా కుర్చీ ఖాళీగా ఉండటం మూలాన ఏదో కాగితం వ్రాయించాల్సి...ప్యూనుచేత కేక వేయించాడు ఆంజనేయుల్ని వామనరావు. 'నేను రాను ఫో...!' వీరాంజనేయులి కేక గదిదాకా విన్పించేసరికి అర్థంగాక నిశ్చేష్టుడయ్యాడు. ఆరు నెలల్నుంచీ దువ్వుతున్న చేతిలో చిలక ఎగిరిపోవటానికి తపతప రెక్కలు కొట్టుకొంటున్నట్టు అనిపించింది వామనరావుకు.

ఆంజనేయులి క్లాసుకు 'సూపర్ వైజ్'కు వెళ్లేడు హెడ్మాష్టరు; వాకిట్లో వామనరావును చూడగానే 'గే...టౌ...ట్!' అన్నాడు మిలటరీ కెమాండర్ కొషన్ ఇచ్చినట్టు.. తోకతొక్కిన త్రాచల్లే కుర్చీమీద నుంచి లేచి ఆంజనేయులు. అంత మంది పిల్లలముందు...తన ఆసిస్టెంటు...అట్లా అంటాడని కలలోకూడా ఊహించలేదు హెడ్మాష్టరు. 'తన అధికారాన్ని గురించీ దానిక్రింద అణగిఉండాల్సిన విధేయతను గురించీ ఇంగ్లీషులో కేకలువేస్తూ ముందుకు వచ్చాడు వామనరావు అభిమానంకొద్దీ!

"నువ్ ద్రోహివి...విశ్వాస ఘాతుకుడివి... మోసం ఎంతకాలమో సాగదు...దొంగపోటు పొడిచే నీచుడివి!" పిచ్చెక్కినట్టు అరుస్తూ ఒక్క ఊపునవచ్చి వామనరావును వాకిటివైపు నెట్టేడు ఆంజనేయులు వీరావేశంతో.

తాను వ్రాసిన రిపోర్టు చేతిలో బట్టుకొని 'ఇదేమిటి?' అని నిలదీసి అడుగుతున్న ఆంజనేయులి నైతికబలం తెగింపు ముందు ఆగలేక పోయాడు వామనరావు. ఈ కాగితం పీడికెట్లా చిక్కిందనే ఆందోళన ఒకప్రక్క తనను అంతంత మాటలంటాడా అని అభిమానం రేపిన అధికారగర్వం మరో పక్క జోరీగల్లా సందడిచేసినయ్ మస్తిష్కంలో. గుమికూడిన పిల్లల్ని కేకలేస్తూ డిసిప్లిన్ లేదని గదమాయిస్తూ పేము బెత్తం పుచ్చుకుని వాళ్ళని క్లాసుల్లోకి తరిమి గబగబా ఆఫీసుకువెళ్ళి రూల్సు ప్రకారం ఆంజనేయుల్ని సంజాయిషీ అడిగేడు. పుండుమీద కారంజల్లినట్టయి ప్యూన్ తెచ్చిన కాగితాన్ని ముక్కలు ముక్కలుచేసి 'వాడబ్బకు చెప్పుకోమను...!' సింహనాదం చేశాడు వాకిట్లోకి వచ్చి వీరాంజనేయులు; అప్పుడే ప్రతిజ్ఞ పట్టేడు ఆంజనేయులు 'ఇది అటో యిటో తేలేదాకా అన్నం తిన'నని!

•  •  •

బీరువా అంతా వెతికేడు వామనరావు ఆంజనేయులు మీద గుదిగుచ్చిన రిపోర్టుల ఫైలుకోసం. ఆ ఎర్ర రంగు ఫైలు తనకు బాగా గుర్తే; అయినా రికార్డంతా దింపించి మళ్ళా వెతికాడు ఆందోళన కొద్దీ. ఆంజనేయులు పైకి వ్రాసుకొన్న పిటిషన్‌కు సంజాయిషీ చెప్పమని గొంతుమీదికి వచ్చి కూర్చుంది స్పెషల్ ఆఫీసరునుంచి. ఎంతసేపటికీ ఎంత వెదికినా ఫైలు కన్పించకపోయేసరికి చీకాకుతో, ఎదుటిగా ఉన్న ప్యూన్‌మీద 'ఎక్కడికి చచ్చేవురా!' అని కేకలు మొదలెట్టాడు. గడచిన రెండు రోజులూ ఇన్నార్జి ఇచ్చిపోయిన 'ఫస్టు అసిస్టెంటు'ను పిల్చి అనేకరకాలుగా క్రాస్ చేశాడు. బెల్లంకొట్టిన రాయల్లే...అదిరిపోయి గుడ్లప్పగించి కూర్చున్నాడు ఆ పట్టభద్రుడు!

ఏంచేద్దామా అని తోచక బోనులో సింహంలా పచార్లు చేస్తున్న వామనరావుకు ఎవరిదో పొడి దగ్గువిన్పించింది. వెనక్కుతిరిగి చూస్తే, వీరాంజనేయులు! వీడేమన్నా తియ్యలేదుగదా! అనుమానం తట్టింది వామనరావుకు; ఇంటిదగ్గర గూట్లో దాచిన కాగితమన్నా ఉంటే ఎంత బాగుండేది... అది కాస్తా పెళ్ళాం తెలివి తక్కువ కొద్దీ ఆవకాయ పచ్చడి పొట్లం రూపంలో ప్రతిద్వందికే చేరింది. నిన్నటిదాకా గడ్డంపెంచి తిండితినకుండా వ్రతం పట్టినట్టు కన్పించిన ఆంజనేయుని మొహం. నున్నగా కళకళలాడుతూ ఎదుటే కన్పించేసరికి తప్పక వీడిపనే అయిఉంటుందని నిశ్చయానికి వచ్చాడు వామనరావు.

అధికారం ఉండాల్సిన చూపుల్లో భయం, దైన్యం కన్పించేసరికి ఆంజనేయునికి నవ్వొచ్చింది. ఆంజనేయుని కళ్ళల్లో విజయగర్వంచూసి ఇంకా బెదిరిపోయాడు వామనరావు. ఎటుచూసినా ఏ మాలోచించినా ... మార్గం కన్పించలేదు ఆ హెడ్మాష్టరుకు!

'తప్పేదో జరిగిపోయింది. రాజీపడదాం!' అనలేక మూలిగాడు వామనరావు. పిల్లలుగల వాడిగా ఊహించుకొని గాలిలో మొక్కలా వణుకుతున్న వామనరావు అవస్థచూసి ఆంజి కళ్ళల్లో నిజంగా నీళ్ళు తిరిగినయ్.

అప్పుడే స్విచ్‌నొక్కిన రేడియో పెద్దగా బ్రాడ్‌కాస్టు చేసింది-'భిన్నవ్యవస్థలుగల దేశాలైనా వ్యతిరేకాభిప్రాయాలుగల వ్యక్తులయినా తోడు తోడుగా మనవచ్చు. అదే సహజీవన సిద్ధాంతం!' అని.

'సరిపోయింది!' అనుకున్నారు అంతాచూస్తున్న తోటి పంతుళ్ళు తమలో.

★